క్లుప్తంగా

8న కల్యాణోత్సవం

సదుం: మండలంలోని మత్తుకువారిపల్లె సమీపంలోని పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8న కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు భగవద్గీత పారాయణం, సాయంత్రం 4.30 గంటలకు రుద్రాభిషేకం, 6 గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న నేతలు

పలమనేరు: కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌ను అమలు చేయాలంటూ స్థానిక సీఐటీయూ నాయకులు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేశారు. పార్టీ నేత గిరిధర్ గుప్త మాట్లాడుతూ కార్మికుల హక్కులను కేంద్రంలోని బీజేపీ కాలరాస్తోందన్నారు. దీనిపై సీఐటీయూ నిరంతర పోరాటాలను సాగిస్తుందని తెలిపారు. బిల్డింగ్ వర్కర్ల సంఘనేత లక్ష్మయ్య, జానకిరాముడు, ఆటో యూనియన్ నేతలు రమేష్, రాజేష్, మురగేష్ పాల్గొన్నారు.

బలి పీఠాలు పునఃనిర్మాణం

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ మాడ వీధుల్లో బలి పీఠాల పునఃనిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో బుధవారం ఉదయం నుంచి బలి పీఠాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజ చేశారు. అనంతరం బలిపీఠాలను ప్రత్యేక వాహనంలో ఊరేగించి నిర్వహించి పునఃనిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య పాల్గొన్నారు.

రెండు బైకుల చోరీ

పుంగనూరు: పట్టణంలోని పాత ద్విచక్రవాహనాలు విక్రయించే దుకాణంలో రెండు వాహనాలు చోరీకి గురయ్యాయి. యజమాని బావాజాన్ బుధవారం షాపు తెరవగా షాపు వెనక మంగళవారం రాత్రి షట్టర్లు కత్తిరించి, రెండు వాహనాలను దొంగలించికెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సేవలు మరువలేనివి



యూనిఫాం ఇస్తున్న చైర్మన్, కమిషనర్

పుంగనూరు: ప్రజల ఆరోగ్యం కోసం రాత్రి, పగలు కష్టపడే కార్మికుల సేవలు మరచిపోలేనివని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డి తెలిపారు. బుధవారం చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి 84 మంది కార్మికులకు యూనిఫాం, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సదుం: మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 26 యూనిట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. బ్యాంకర్లతో కలసి ప్రభుత్వం గరిష్ఠంగా 50 శాతం రాయితీతో రుణాలను మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని కోరారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యదర్శి నియామకం


సల్మా

పుంగనూరు: జిల్లా హ్యూమన్ రైట్స్ మహిళా విభాగం క్రైమ్ కంట్రోల్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఎం.ఏ.సల్మాను నియమిస్తూ ఎన్‌హెచ్‌ఆర్‌సీసీఎఫ్ చైర్మన్ ఏ.మదేష్ బుధవారం ఉత్తర్వులు పంపారు. సల్మా మాట్లాడుతూ మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వారి హక్కులను కాపాడుతానని తెలిపారు.

బేబీ కిట్ల పంపిణీ


కిట్లను పంపిణీ చేస్తున్న సభ్యులు

వి.కోట: ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ఏర్పాటైన లయన్స్‌క్లబ్ సంస్థ బుధవారం వి.కోట గ్రేటర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు బేబీ కిట్లు, అల్పాహారాన్ని పంపిణీ చేసినట్లు ఆ సంస్థ మండలాధ్యక్షుడు ధీరజ్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో బాలింతలకు బేబీ కిట్లను పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. సంస్థ అధ్యక్షుడు ధీరజ్, క్లబ్ సభ్యులు, లక్ష్మణ్ చౌదరి, తుకారం, నాగరాజు, మురుగేష్ పాల్గొన్నారు.

అటవీ అభ్యంతరం
రహదారులకు గ్రహణం

- దశాబ్దాలుగా తీరని అంతర్రాష్ట్ర రహదారుల సమస్య
- తమిళనాడు సీఎంతో చంద్రబాబు భేటీ
- 84కిలోమీటర్ల రోడ్లను ఏపీ నుంచి తమిళనాడులోకి..

నియోజకవర్గంలోని పలు అంతర్రాష్ట్ర రహదారుల పనులకు అటవీశాఖ అభ్యంతరాలతో దశాబ్దాలుగా గ్రహణం పట్టుకుంది. ఈ రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వంలో విడుదలైన నిధులు సైతం వెనక్కి వెళ్లాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు పనుల కోసం తీవ్రంగా కృషి చేసినా అటవీశాఖ క్లియరెన్స్ లభించక పనులు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం స్టాలిన్‌తో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పలమనేరు నియోజకవర్గంలోని అంతర్రాష్ట్ర రహదారులు, ఇతరత్రా సమస్యలపై భేటీ కావడంతో మళ్లీ రహదారుల సమస్య తెరపైకి వచ్చింది. ఇకనైనా ఈ సమస్య పరిష్కరిస్తారా? అని చర్చకు తావిచ్చింది.



ఆగిన పేర్నంబట్ అంతర్రాష్ట్ర రహదారి


చెత్తపెంట మీదుగా అరట్లకు వెళ్లే రహదారి

పలమనేరు: నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం మీదుగా పేర్నంబట్‌కు రహదారి ఉంది. కేవలం 22 కిమీల దూరమున్న ఈ రహదారి స్థానికులకెంతో సౌకర్యంగా ఉంటుంది. బైరెడ్డిపల్లె నుంచి తమిళనాడులోని పేర్నంబట్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం వి.కోట నుంచి లేదా పలమనేరు నుంచి 60 కి.మీ చుట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. అదే ఈ నిర్మాణం పూర్తయితే అరగంటలో పేర్నంబట్‌కు చేరుకోవచ్చు. బైరెడ్డిపల్లె నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు గత ప్రభుత్వంలో తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. మరోవైపు పేర్నంబట్ నుంచి తమిళనాడు ప్రభుత్వం వారి సరిహద్దు వరకు పక్కా రోడ్డు నిర్మించింది. అయితే కౌండిన్య అటవీ ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర రహదారి పనులకు అటవీశాఖ నుంచి మన ప్రభుత్వానికి అనుమతులు లభించలేదు. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించేందుకు రోడ్డు లేకుండాపోయింది.


నెల్లిపట్ల మీదుగా పేర్నంబట్‌కు వెళ్లే రోడ్డు

నెల్లిపట్ల, అరట్ల రోడ్లకు ఇదే పరిస్థితి

పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె నుంచి బైరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట్ల మీదుగా తమిళనాడు రాష్ట్రంలోని అరట్లకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పనులు నిర్మాణానికి నోచుకోలేదు. ఇప్పటికే మన రాష్ట్రంలోని నెల్లిపట్ల నుంచి అటవీమార్గంలో తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు వేశారు. తమిళనాడు ప్రభుత్వం వారి సరిహద్దు వరకు తారు రోడ్డు వేసింది. అయితే నాలుగు కిలోమీటర్ల మేర మన రాష్ట్రంలో రోడ్డు పనులు ఆగిపోయాయి. అటవీశాఖ అభ్యంతరాలు మూలాన ఈ పనులు ఆరేళ్ల నుంచి కొండెక్కాయి. దీంతో ఇరు రాష్ట్రాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

రోడ్లు వేస్తే ఎంతో మేలు

పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాల నుంచి తమిళనాడు రాష్ట్రంలోకి దగ్గర రహదారులున్నాయి. అయితే ఈ రెండు రాష్ట్రాలకు మధ్య దట్టమైన కౌండిన్య అటవీప్రాంతం ఉంది. కేవలం అటవీశాఖ అభ్యంతరాల కారణంగా రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం లేకుండాపోతోంది. ఈ పనులు గనుక పూర్తయితే రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలు పెరిగి ఈ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలోని ఎన్‌డీఏ సూచనల మేరకు ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రులు పలమనేరు నియోజకవర్గంలోని సరిహద్దు రహదారులపై చర్చించడంతో ఇక్కడి అంతర్రాష్ట్ర రోడ్ల సమస్య పరిష్కారం అవుతాయా? అనే ఆశలు రేకెత్తాయి.

చెత్తపెంట-తమిళనాడు సరిహద్దు

పలమనేరు మండలంలోని చెత్తపెంట నుంచి బాపలనత్తం, నెల్లిపట్ల మీదుగా తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు పనులకు అటవీశాఖే ఇబ్బందిగా మారింది. కనీసం పలమనేరు మండలం నుంచి బైరెడ్డిపల్లె మండలానికి సైతం రోడ్డు ఏర్పాటుకు ఫారెస్ట్ అధికారులు నో చెప్పారు. 2005–06 ఆర్థిక సంవత్సరంలో నాబార్డ్ నిధుల నుంచి ఈ రోడ్డు నిర్మాణానికి గతంలో రూ.2.5 కోట్లు మంజూరైంది. పలమనేరు మండలంలోని పెంగరగుంట క్రాస్ నుంచి తారు రోడ్డు పనులు చెత్తపెంట సరిహద్దు వరకు పూర్తయ్యాయి. అయితే బాపలనత్తం వద్ద అటవీ ప్రాంతంలో అభ్యంతరాల కారణంగా ఈ పనులు ఆగిపోయాయి. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి.

కోలాహలం.. గంగజాతర

బైరెడ్డిపల్లె: మండలంలోని గొల్లచీమనపల్లెలో కోలాహలంగా గంగజాతరను నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సుకు గ్రామ పొలిమేరల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఊరేగించగా భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజి బుధవారం ఎస్టీయూ 2025 డైరీ, క్యాలెండర్‌ను మండల శాఖ అధ్యక్షుడు బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆర్థిక కార్యదర్శి శివప్రకాష్‌బాబు, డివిజినల్ కన్వీనర్ నారాయణస్వామి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ అంజాద్ ఆలీఖాన్, లక్ష్మీపతి, నాగరాజు పాల్గొన్నారు.

అడిగిన చోట పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

రొంపిచెర్ల: కూలీలు అడిగిన చోట ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం రొంపిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఏపీఓ బాలమురళి, ఈసీ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు మురళి, మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో అధికలాభాలు



వేరుశనగ పొలంలో అధికారులు, రైతులు

శాంతిపురం: తక్కువ పెట్టుబడులతో చేసే ప్రకృతి సేద్యంతో రైతులు అధిక లాభాలను ఆర్జించవచ్చని మండల వ్యవసాయ అధికారి అప్పోజి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం గుండిశెట్టిపల్లి వద్ద వ్యవసాయ పొలాల్లో రైతులకు పలు విషయాలను వివరించారు. బంగాళాదుంప, మామిడి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించి ఆయా పంటల్లో రైతులు పాటించాల్సిన సస్యరక్షణ పద్ధతులను వివరించారు.

శిల్పి ఎమ్మెస్ రమణ మృతి


అమ్మవారి శిరస్సుతో ఎమ్మెస్ రమణ(ఫైల్)

పలమనేరు: పట్టణంలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతరలో అమ్మవారి శిరస్సును తయారు చేసే శిల్పి ఎమ్మెస్ రమణ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెస్ రమణతోపాటు వీరి కుటుంబీకులు ఎన్నో ఏళ్లుగా ఏటా అమ్మవారి శిరస్సును తయారు చేయడంలో సిద్ధహస్తులు. ఈనేపథ్యంలో వీరి కుటుంబం నుంచి ఇప్పటిదాకా రమణ అమ్మవారి శిరస్సును చేసేవారు. ఆయన అనారోగ్యంతో మృతిచెందడంపై పట్టణవాసులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాగా ఆయన అంత్యక్రియలు స్థానిక యూనివర్సల్ స్కూల్ నిర్వాహకులు యుగంధర్ స్వగృహంలో నేడు నిర్వహించనున్నారు.

భూ కబ్జా చేసి స్థిరాస్తి వ్యాపారం

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పెద్దపంజాణి తహసీల్దార్
- కొళత్తూరు గ్రామస్తుల ఆరోపణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దేవాలయ భూములు, రచ్చబండ భూమిని కబ్జాదారులు ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారని పెద్దపంజాణి మండలం కొళత్తూరు గ్రామస్తులు ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. గ్రామంలోని గంగమ్మ ఆలయం రణబేరమ్మ ఆలయం, సప్పలమ్మ గుడిలో గ్రామస్తులు పూజలు చేస్తున్నారని, ఈ గుడి ముందర స్థలాన్ని రచ్చబండగా వినియోగిస్తున్నట్టు చెప్పారు. అక్కడున్న భూమిలోని కొంత స్థలంలో సచివాలయం నిర్మించారని చెప్పారు. సచివాలయానికి ఆనుకొని ఉన్న స్థలంలో బెంగళూరుకు చెందిన మునిరామయ్య కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేస్తున్నారని, దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తాము ఫిర్యాదు చేసినందుకు గ్రామస్తులపై దౌర్జన్యాలు చేస్తున్నారని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి ఆక్రమణ గురైన భూములను పరిరక్షించాలని, గ్రామ అవసరాలకు ఆ భూములను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్పత్రిలో చేర్పిస్తే రివార్డులు


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంవీఐ, మెడికల్ ఆఫీసర్

పుంగనూరు: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను వెంటనే ఆస్పత్రులకు తరలించి, వైద్యసేవలు అందించే వారికి రూ.5 వేలు నగదు అవార్డు ఇవ్వనున్నట్లు ఎంవీఐ సుప్రియ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను ఏరియా ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ మధుసూదనచారితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోస్టర్లను విడుదల చేశారు. ఎంవీఐ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారికి గోల్డెన్ అవర్‌గా చికిత్స అందిస్తే వారి ప్రాణాలు కాపాడేందుకు వీలుందన్నారు. ఇలాంటి సమయాల్లో బాధితులను ఆస్పత్రికి తరలించే వారికి అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు అంబులెన్సులకు ఒప్పందం


ఒప్పందం కుదుర్చుకుంటున్న కడా పీడీ

కుప్పం: కుప్పం వంద పడకల ఆస్పత్రిలో ఆధునిక వసతులతో కూడిన రెండు అంబులెన్సులను ఏర్పాటు చేసేందుకు కడా ప్రాజెక్టు పేటీఎం ఫౌండేషన్ వారిచే ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం కడా ప్రాజెక్టు, పేటీఎం ఫౌండేషన్ ప్రతినిధులు వంద పడకల ఆస్పత్రిలో రూ.66 లక్షలు విలువ చేసే రెండు అంబులెన్సులకు సంబంధించి ఎంఓయూ చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తాం


వికలాంగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: దివ్యాంగుల డిమాండ్ల మేరకు వారికి తప్పనిసరిగా ఇంటి స్థలాలను కేటాయిస్తామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చిన దివ్యాంగుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించాలని కోరారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తప్పనిసరిగా సమస్యను పరిష్కరిస్తామని వారికి హామీలిచ్చారు. మండలంలోని చల్లపల్లిలో గ్రామస్తులు ఘనంగా సంక్రాతి పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ హాజరై పశువులకు చేపట్టిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపంజాణి : గ్రామస్థాయిలో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం పెద్ద పంజాణి మండల కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పలమనేరు ఆర్‌డీఓ భవాని, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీఓ బాలాజీతో కలసి తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్వోలు తప్పని సరిగా ప్రతిరోజూ గ్రామ సచివాలయాలకు వెళ్లాలని, సచివాలయ సిబ్బంది రోజూ హాజరు నమోదు చేయాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పరిష్కారం చేయాలని, అర్జీదారులను ఆఫీసుల చుట్టూ తిప్పించుకోవద్దని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కుప్పంరూరల్: పట్టణంలోని హెచ్‌పీ రోడ్డు, గుడుపల్లె రోడ్డులో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని రెస్కో డీఈ ప్రభాకర్ తెలిపారు. విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని రెండు వీధుల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నక్కపల్లిలో గడ్డివాము దగ్ధం

పలమనేరు: మండలంలోని నక్కపల్లిలో బుధవారం గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తన ఇంటి పక్కనే గడ్డివాము వేసుకున్నాడు. బుధవారం ఎలా జరిగిందో తెలియదుకానీ అగ్నిప్రమాదం సంభవించి గడ్డివామి దగ్ధమైంది. దీంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో లక్ష దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన


మాట్లాడుతున్న ఇన్‌కంటాక్స్ అధికారులు

పలమనేరు: పట్టణంలోని ఓ ప్రైవేటు భవనంలో తిరుపతి ఆదాయపుపన్ను శాఖ అధికారులు బుధవారం ఆదాయపు పన్ను చెల్లింపులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు హాజరైన ఆశాఖ అడిషనల్ కమిషనర్ వంశీధర్, చిత్తూరు అధికారి వెంకటేశులు మాట్లాడారు. ముందుస్తు టాక్స్‌ల చెల్లింపులు, నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వాలి, ఏఈఎస్ పోర్టల్ సేవలపై అవగాహన కల్పించారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, పలు కంపెనీల నిర్వాహకులు, కళాశాలల యాజమాన్యాలు, చార్టడ్ అకౌంట్‌లు, కంపెనీ మేనేజర్లు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళి

వి.కోట: స్థానిక సీహెచ్‌సీలో గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన గుండెపోటుకు ఉచితంగా ఇంజక్షన్‌పై ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళి మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారికి రూ.42వేల విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా రోగులకు అందిస్తామని తెలిపారు. డాక్టర్లు ప్రవీణ్, సంపత్‌కిరణ్, కల్పన, అశ్విని, ప్రమీల పాల్గొన్నారు.

టమాట ధరలకు రెక్కలు

–బాక్సు ధర రూ.260


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

పలమనేరు: ఫిబ్రవరి మొదలు కాగానే ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో టమాట ధరలకు రెక్కలొచ్చాయి. మొన్నటిదాకా బాక్సుధర రూ.100 ఉండగా, ఈ వారంలో పెరుగుతూ వచ్చి బుధవారం నాటికి స్థానిక టమాట మార్కెట్‌లో బాక్సు(15కిలోలు) ధర రూ.260కి చేరింది. ఈనెల ఆఖరుకల్లా ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటిదాకా జిల్లాలోని మార్కెట్లకు భారీగా వస్తున్న అనంతపూర్ సరుకు తగ్గుముఖం పట్టింది. తమిళనాడులోని సరుకు అంతంతమాత్రంగానే ఉంది. మరోవైపు లోకల్ సరుకు సైతం సాధారణ విస్తీర్ణం కంటే ఈ దఫా సగానికి తగ్గింది. దీంతో బయటి వ్యాపారులు సైతం ఎక్కువగా ఇక్కడ టమాట కొనేందుకు వస్తున్నారు. ఫలితంగా ధరలు రోజురోజుకు పెరుగుతున్నట్టు తెలుస్తోంది. ఈనెలాఖరుకు మరింత ధర పెరిగే అవకాశం ఉంటుందని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే స్థానికంగా రోజువారి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు చేరాయి. ఈనెలాఖరుకు మరింత ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బోర్లలో నీరు తగ్గి పంటలకు కావాల్సిన సాగునీరు తగ్గనుంది. దీంతో టమాట సాగు తగ్గుముఖం పట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల ఆఖర్ నుంచి మార్చిలో మరింతగా ధరలు భారీగా పెరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.